నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 8 జనవరి 2025 | HYDERABAD

ప్లాట్లు ఇచ్చే రైతుల జాబితా.. గ్రామపంచాయతీల్లో..

కందుకూరు, జనవరి 7 : ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లను ఇచ్చేందుకు వారి పేర్లతో కూడిన జాబితాలను ఆయా గ్రామ పంచాయతీల్లో ఉంచుతున్నట్లు ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మీర్‌ఖాన్‌పేట్, ఆకులమైలారం, అన్నోజిగూడ, బేగరికంచ, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి భూములను సేకరించిందన్నారు. ఎకరానికి గుంట, 131 గజాల చొప్పున ప్లాట్లను ఇవ్వడానికి వారి పేర్లను గ్రామ పంచాయతీ బోర్డుల్లో బుధవారం నుంచి ఉంచుతామని, అభ్యంతరం ఉన్నట్లయితే వారం రోజుల్లో ఆర్డీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

గాంధీలో ఐసోలేషన్ వార్డు

బన్సీలాల్‌పేట్: హెచ్ఎంపీవీ వైరస్ బాధితులకు వైద్య సేవలు, చికిత్స అందించేందుకు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో ప్రత్యేకంగా 40 పడకలతో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్. రాజకుమారి తెలిపారు. వివిధ శాఖల హెచ్ఓడీలు డాక్టర్లు కృష్ణమూర్తి, సునీల్‌కుమార్, వాసుదేవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రిలతో ఆమె మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

రూ.500 ఇస్తేనే..

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన

అధికారుల తీరుపై బస్తీవాసుల ఆందోళన

అల్లాపూర్: రూ. 500 ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పరిశీలిస్తున్నారంటూ.. బస్తీవాసులు ఆందోళనకు దిగారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరగడం లేదని, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారులు అవకతవకలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మంగళవారం అధికారులు అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ అల్లాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు. ఈ క్రమంలో దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరగడం లేదని, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారులు అవకతవకలు చేస్తున్నారని బస్తీవాసులు ఆరోపిస్తూ...పెద్దఎత్తున రోడ్ల పైకి ఆందోళన చేశారు. రూ. 500 ఇచ్చిన వారి దరఖాస్తునే పరిశీలిస్తున్నారని, పైసలు ఇవ్వని వారికి సాకులు చెప్పి.. తరువాత వచ్చి పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో న్యూఅల్లాపూర్‌లో పర్యటించిన కార్పొరేటర్ సబీహాబేగంను కలిసిన బస్తీవాసులు.. తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎలాగైనా న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబీహాబేగం మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించి అర్హులైన పేదలకే ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్ల కేటాయింపులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, పార్టీలకు అతీతంగా ఇండ్లు లేని నిరుపేదలకే ఇండ్లు దక్కేలా చూడాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్న అవకతవకలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి ..అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు నజీర్, శివరాజ్, మల్లికార్జున్, జాఫర్, బషీర్, అఫ్రాఫ్ పాల్గొన్నారు.

అల్లాపూర్ డివిజన్‌లో మంగళవారం ఆందోళనకు దిగిన బస్తీవాసులు

> హైదరాబాద్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. సర్కారు సరైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రధాన కూడళ్లలో నిత్యం భారీగా ట్రాఫిక్ స్తంభిస్తున్నది. మంగళ వారం రాయదుర్గం మార్గంలో కనిపించిన దృశ్యమిది.

హెచ్ సిటీపై రివర్స్ గేర్..!

నిలిచిన కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్ల పనులు

టెండర్ల దశలోనే వెనక్కి తగ్గిన అధికారులు

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ) : పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆదిలోనే కేబీఆర్ ప్రాజెక్టు రివర్స్ గేర్‌లోకి మళ్లింది. టెండర్ల దశలోనే అధికారులు వెనక్కి తగ్గారు. ఇందుకు భూ సేకరణ ప్రధాన కారణమని అధికార వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)లో భాగంగా పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో రూ. 1090 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులకు గత నెలలో జరిగిన ప్రజా పాలన ఏడాది విజయోత్సవ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే టెండర్ల దశను ముగించి అర్హత గల ఏజెన్సీతో పనులు ప్రారంభించాల్సిన అధికారులు భూసేకరణపై స్పష్టత వచ్చాకనే టెండర్లు పిలవాలని ఇంజినీరింగ్ విభాగం నిర్ణయించింది. దీంతో ఈ ప్రాజెక్టు ఇప్పట్లో పట్టాలెక్కడం కష్టసాధ్యమేనన్న చర్చ లేకపోలేదు.

భూసేకరణ అసలైన పరీక్ష

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు చుట్టూ వాహనాల రద్దీ నియంత్రణ, వాహనదారులు తేలిగ్గా ముందుకు సాగేందుకు వీలుగా ప్రభుత్వం ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల్లో అత్యంత క్లిష్టమైనది భూ సేకరణ ప్రక్రియ..అయితే ఈ ప్రాజెక్టు విషయంలో క్లారిటీ లేకుండానే హడావుడి చేసి ప్రస్తుతం అటకెక్కించారు. ప్రస్తుతం పాత రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఆర్‌డీపీ) పరిగణనలోకి తీసుకుని కొత్త ఆర్‌డీపీ ప్లాన్ సిద్ధం చేశారు. గత ఆర్‌డీపీలో దాదాపుగా 86 నివాసాలు ఉన్నట్లు తేలింది. అయితే ఈ నివాసాల నుంచి ఆస్తుల స్వాధీనం అధికారులకు సవాల్‌గా మారింది.

ప్రముఖుల ఇండ్లు..

బంజారాహిల్స్ రోడ్ నం. 12 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు భూసేకరణలో భాగంగా గతంలోనే పలు భవనాలను మార్కింగ్ వేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం .92లో నివసించే మాజీ మంత్రి జానారెడ్డి రోడ్డు విస్తరణలో భాగంగా తన ప్లాట్ నుంచి 600 గజాల స్థలాన్ని కోల్పోనున్నారు. ఇక జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లో ఉన్న హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటికి కూడా మార్కింగ్ వేశారు. సుమారుగా తన ప్లాట్‌లో 500 గజాల వరకు కోల్పోనున్నారు. మాజీ మంత్రులు సమర సింహారెడ్డి, షబ్బీర్ అలీ, కేఈ కృష్ణమూర్తి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, హీరో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి తదితర ఇండ్లకు కూడా మార్కింగ్ వేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 12 విరంచి ఆసుపత్రి నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు ప్రస్తుతం 80 అడుగుల రోడ్డు ఉంది. దీనిని 100 అడుగుల మేర విస్తరించనున్నారు. ఈ రోడ్డుకు రెండు వైపులా ఆస్తులు సేకరణ చేపట్టాలని నిర్ణయించారు. 86 నివాసాలకు మార్కింగ్ చేశారు.

ప్రాజెక్టు విశేషాలు

కేబీఆర్ పార్కు చుట్టూ అగ్రసేన్, ఫిలింనగర్, క్యాన్సర్ హాస్పిటల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం ఇలా ఆరు జంక్షన్లు ఉన్నాయి. ఈ ఆరు జంక్షన్లలో 8 స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్‌పాస్‌ల నిర్మాణం జరగనుంది. జూబ్లీహిల్స్ జంక్షన్, కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద రెండు చొప్పున నాలుగు స్టీల్ బ్రిడ్జిలు రానున్నాయి. మిగతా నాలుగు జంక్షన్ల వద్ద ఒక్కో స్టీల్ బ్రిడ్జి, ఆరు జంక్షన్ల వద్ద ఒక్కొక్కటి చొప్పున ఆరు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు నుంచి రోడ్డు నెంబరు. 45 వైపు వచ్చే ఫ్లై ఓవర్‌పై భాగంలో రెండు లేన్లతో రానుంది. కేబీఆర్ పార్కు నుంచి రోడ్ నం. 36 వైపు నాలుగు లేన్ల కింద నుంచి వెళ్లనుంది. ఈ నిర్మాణాలతో కేబీఆర్ పార్కు గ్రీనరీపై ప్రభావం పడుతుందని గతంలో పలువురు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించాయి. ప్రస్తుతం సైతం పర్యావరణ వేత్తలు కొందరు ఎన్జీటీకి వెళ్లే అస్కారం కూడా లేకపోలేదు.

గౌతంనగర్ గేటు వద్ద రూ. 30 కోట్లతో ఆర్‌యూబీ

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్: గౌతంనగర్ డివిజన్ ప్రజలకు, వాహనదారులకు దశాబ్ద కాలంగా నెలకొన్న రైల్వే గేటు అవస్థలు తీరనున్నాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ. 30 కోట్ల వ్యయంతో గౌతంనగర్ గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి వివిధ శాఖల అధికారులతో మంగళవారం సన్నాహక సమావేశంలో జీహెచ్ఎంసీ, జలమండలి , విద్యుత్, వివిధ శాఖల అధికారులతో ఆర్‌యూబీపై రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడారు. సుమారు రూ. 30 కోట్ల వ్యయంతో గౌతంనగర్ ఆర్‌యూబీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైనట్లు చెప్పారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని వాజ్‌పేయినగర్ ఆర్‌యూబీ నిర్మాణం అల్వాల్ , మచ్చబొల్లారం తదితర ప్రాంతాల్లో సుమారు 5 ఆర్‌యూబీలు నిర్మాణానికి చర్చలు జరిపామన్నారు. త్వరలో ఈ పనులను ప్రారంభించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. సమన్వయంతో పనిచేసి ఆర్‌యూబీ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, రైల్వే అధికారులు, బీఆర్ఎస్ నేతలు మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

డైవర్షన్ కోసమే కేటీఆర్‌పై కేసులు

కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు

> రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా హస్తం పార్టీ కుట్రలకు తెరలేపుతున్నదని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు మండిపడుతున్నారు. పాలన చేతకాక బీఆర్ఎస్ ముఖ్య నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు.
> - కంటోన్మెంట్, జనవరి 7

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు పెట్టగానే ఈడీ వచ్చింది. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై ఎమ్మెల్సీ కవితను జైలుకు పంపారు. ప్రస్తుతం కేటీఆర్, కవిత, హరీశ్‌రావుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. రేవంత్ అబద్ధాల అలవాటు మార్చుకోవడం లేదు. నిన్నటి వరకు కాళేశ్వరం సహా అనేక విషయాలపై అబద్ధాలు మాట్లాడారు. ఇప్పుడు ఫార్ములా ఈ రేస్ పేరుతో కొత్త నాటకానికి తెరలేపారు. దేశంలోనే ఫార్ములా ఈ కార్ రేస్ జరిగింది హైదరాబాద్‌లోనే. ఫార్ములా ఈ కార్ రేస్ వల్ల రాష్ట్రానికి రూ. 700 కోట్ల ఆదాయం సమకూరింది.

- జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు

కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే ఉద్యమం తప్పదు..

సర్కారు కక్ష పూరింతగా కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే మరో ఉద్యమం తప్పదు. ఈ రేస్‌ను కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకున్నాకే రాష్ట్రంలో నిర్వహించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే చూస్తూ ఊరుకోం. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలికి పాలనపై దృష్టి కేంద్రీకరించాలి.

- గజ్జెల నాగేశ్, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

ఆరోపణలు నిరాధారం

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు విషయంలో ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు నిరాధారం. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను పక్కదారి పట్టించడానికి, వీటిపై రైతుల్లో, ప్రజల్లో చర్చకు రానివ్వకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా పెట్టిన చెత్త కేసు ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ.. రైతాంగాన్ని మేల్కొపుతున్న కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు.

- మన్నె క్రిశాంక్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ, మాజీ చైర్మన్

డబుల్ గృహాలకు మెయింటెనెన్స్ చార్జీలు

కొల్లూరులో ఒక్కో ఇంటికి నెలకు రూ.2వేలు..

ప్రతి బ్లాక్‌లో అడ్మిన్ అవతారమెత్తి వసూళ్లు

ఖైరతాబాద్, జనవరి 7 : పేదలకు నీడ కల్పించేందుకు గత ప్రభుత్వ హయాంలో వేలాదిగా డబుల్ గృహాలు నిర్మించారు. తద్వారా ఎందరో తమ సొంతింటి కల నిజం చేసుకున్నారు. పటాన్‌చెరూ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం మండలం, కొల్లూరు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం గృహాలు ప్రస్తుతం కొందరికి కాసుల పంట పండిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో గత ఏడాది కిందట కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడ సౌకర్యాలు, సదుపాయాలను విస్మరించడంతో పలువురు గృహాలకు తాళాలు వేసి మళ్లీ అద్దె గృహాల్లోకి వెళ్లిపోయారు. దాని ఆసరాగా చేసుకున్న కొందరు ఒక్కో ఇంటికి అక్రమంగా మెయింటెనెన్స్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఇవ్వకుంటే పట్టాలను రద్దు చేయిస్తామని బెదిరింపులకు సైతం పాల్పడుతున్నట్లు తెలిసింది.



ఒక్కో ఇంటికి రూ.2వేలు..

2018లో సుమారు 145 ఎకరాల్లో రూ.1,489.29 కోట్లతో 117 బ్లాకుల్లో, సిల్ట్ + 9, 10, 11 అంతస్తుల్లో 15,660 డబుల్ బెడ్రూం ఇండ్లను చేపట్టారు. 2023 జూన్ నాటికి నిర్మాణం పూర్తయ్యింది. నగరంలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు అప్పటి ప్రభుత్వం విడతల వారీగా అందిస్తూ వచ్చింది. 2023 నవంబర్‌లో ఎన్నికల నగరా మోగగా, గృహాల పంపిణీకి బ్రేక్ పడింది. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం మారడంతో డబుల్ బెడ్రూం గృహ యజమానులకు ఇక్కట్లు మొదలయ్యాయి. కరెంటు, నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. నిర్వహణ బాధ్యతలను అధికార యంత్రాంగం విస్మరించింది. అనేక మంది సొంతింటిని వదిలి తిరిగి అద్దె గృహాలకు వెళ్లిపోయారు. అదే అదునుగా భావించిన కొందరు అధికార పార్టీ అండతో... అక్కడ మెయింటెనెన్స్ దుకాణం తెరిచినట్లు తెలిసింది. ఇండ్లలో ఉండకుంటే తమ పట్టాలను రద్దు చేయిస్తామని బెదిరింపులకు పాల్పడుతూ ఒక్కో ఇంటికి నెలకు రూ.2వేల చొప్పున వసూలు చేస్తున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని సోమాజిగూడ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులు వాపోయారు. తమ ఇండ్లు తమకే ఉండాలంటే నెలకు మెయింటెనెన్స్ చార్జీలు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారని, ప్రతి బ్లాక్‌కో అడ్మిన్ అవతారమెత్తి తమ వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏడాది కాలంగా తమ గృహాలకు తాగునీటిని ఇబ్బందులు కలుగుతున్నాయని, లిఫ్టులు పనిచేయడం లేదని, నిత్యం విద్యుత్ కోతలు జరుగుతున్నాయని, దిక్కుతోచని స్థితిలో సొంతిళ్లను వదిలి కిరాయిండ్లలో ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

రియల్ బూమ్ ఉంటే.. అప్పులెందుకు?

అభివృద్ధి పనులకు హెచ్ఎండీఏ రూ. 20వేల కోట్ల అప్పులు

సిటీబ్యూరో: ఒకప్పుడు సొంత నిధులతో ప్రాజెక్టులు చేపట్టిన పరిస్థితి. అంతేకాదు.. కొత్త ప్రాజెక్టులకు ఇతర శాఖలకు నిధులను సమకూర్చిన ఘనత. కానీ ఇప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోవడంతో.. సొంత ప్రాజెక్టులను చేపట్టేందుకు హెచ్ఎండీఏ నిధులను అన్వేషిస్తోంది. ప్రాజెక్టులను వేగంగా పట్టాలెక్కించాలంటే ఆర్థిక వనరులు అడ్డు తగులుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏ చేపట్టిన భారీ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అప్పులు చేసేందుకు సిద్ధమవుతున్నది. ఇక ప్రభుత్వం నిధులిచ్చే పరిస్థితి లేకపోవడంతో.. రూ. 20వేల కోట్ల నిధులను అప్పుల రూపంలో సేకరించేందుకు సిద్ధమవుతున్నది.

అప్పుల కోసం వెంపర్లాట..

ఇటీవల కాలంలో హెచ్ఎండీఏకు వచ్చే ప్రధాన ఆదాయ మార్గాలైన భవన నిర్మాణ అనుమతులు. వీటి ద్వారా మెజార్టీ రెవెన్యూ సమకూరేది. ప్లానింగ్ విభాగం సేకరించే నిధులకు అదనంగా భూముల వేలం, డెవలప్‌మెంటల్ యాక్టివిటీతో హెచ్ఎండీఏ ఖజానా నిండేది. కానీ పరిస్థితి తలకిందులైంది. వచ్చే ఆదాయం ఏకంగా 50 శాతానికి తగ్గింది. దీంతో నెలవారీ నిర్వహణ, జీతభత్యాలు మినహా కొత్త ప్రాజెక్టులను చేపట్టాలంటే గల్లపెట్టే ఖాళీగా ఉంది. ముఖ్యంగా ప్రతిపాదిత ప్రాజెక్టులను కూడా పూర్తి స్థాయిలో కార్యరూపంలోకి తీసుకు రాలేకపోతున్నారు. మైనర్ పనులకు టెండర్లను ఆహ్వానిస్తున్నా.. నిధుల కొరతతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టే అవకాశం లేక అప్పులు కోసం హెచ్ఎండీఏ సిద్ధమవుతున్నది.ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంగా గుర్తించే స్థాయిలో ఏ ఒక్క ప్రాజెక్టును చేపట్టలేదు. కనీసం శంకుస్థాపన చేసిన రెండు ఎలివేటెడ్ కారిడార్ పనులను కూడా ఇప్పటి వరకు పట్టాలెక్కించలేదు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భూసేకరణతో కలిపి మొత్తం రూ. 10వేల కోట్లు దాటుతుండగా.. మరో రూ. 10 వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికే ఎప్పుడో అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్‌గూడ ఎకో పార్క్ నిధులేక పనులు ఇంకా కొనసాగతూనే ఉన్నాయి. మరో వైపు మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం అంటూ హడావుడి చేసినా.. ఇంక పనులే మొదలు కాలేదు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ఫోర్త్ సిటీ, రీజినల్ రింగు రోడ్డును అనుసంధానం చేసే గ్రీన్‌ఫీల్డ్ హైవేలకు అదనంగా సుమారు మరో రూ. 5వేల కోట్లు ఖర్చు చేస్తే గానీ ప్రాజెక్టు పూర్తి చేసే పరిస్థితి లేదు.

నిధులు లేక..

నిజానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ కుప్పకూలిందనే వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పాలనపరమైన విధానాలు అమ్మకాలు పడిపోయాయి. కానీ హెచ్ఎండీఏ పరిధిలో అనుమతులు జోరుగా సాగుతున్నాయని, గతేడాది కంటే ఎక్కువ శాతం అనుమతులు ఇస్తున్నామని, రెవెన్యూ కూడా పెరిగిందంటూ సర్కారు వ్యాఖ్యానించింది. కానీ ప్రాజెక్టులను చేపట్టేందుకు నిధులు లేక అప్పుల కోసం సిద్ధం కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గతమెంతో ఘనం..

నిజానికి గడిచిన పదేండ్లలో హెచ్ఎండీఏ నిధుల కోసం ఏనాడూ అప్పుల కోసం చేయి చాపలేదు. ట్యాంక్ బండ్ సుందరీకరణ, కొత్వాల్‌గూడ ఎకో పార్క్, ఓఆర్ఆర్ వెంబడి సైకిల్ ట్రాక్, రేడియల్, లింకు రోడ్ల నిర్మాణం, వరల్డ్ క్లాస్ ప్రమాణాలతో కోకాపేట లే అవుట్ అభివృద్ధి వంటి అనే ప్రాజెక్టులను చేపట్టింది. పదేండ్లలో ఏకంగా రూ. 15వేల కోట్లకు పైగా నిధులను హెచ్ఎండీఏ ఖర్చు చేసి ప్రాజెక్టులను చేపట్టింది. రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు రూ. 450 కోట్లు నిధులను హెచ్ఎంఆర్ఎల్‌కు సమకూర్చేంత స్థాయిలో ముందుకు సాగింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కొత్త ప్రాజెక్టులను చేపట్టలేక నిధుల కోసం అప్పులు చేసే పరిస్థితికి హెచ్ఎండీఏ దిగజారింది.

నేటి నుంచి మెట్రో సంక్రాంతి ఉత్సవాలు

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ సంబురాలను వైభవంగా నిర్వహించేందుకు హైదరాబాద్ మెట్రో సన్నాహాలు చేస్తున్నది. నేటి నుంచి మూడు రోజుల పాటు 'మీ టైం ఆన్‌మై మెట్రో' క్యాంపెన్ పేరిట వేడుకలను నిర్వహిస్తున్నది. పండుగ సంబురాలను ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో ప్రారంభించనున్నారు. వేడుకల్లో భాగంగా తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు, తెలుగు ఔన్నత్యాన్ని చాటేలా వేడుకలను నిర్వహించేందుకు ఎల్ అండ్ టీ ఏర్పాట్లు చేసింది. నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో ఈ వేడుకలు ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు.

మా బిడ్డలకు చూపు ప్రసాదించండి..!

సిటీబ్యూరో, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : బాగ్ లింగంపల్లికి చెందిన శ్యామల తన ఇద్దరు కుమార్తెలు పుట్టుకతో కంటి చూపు లేకుండా బాధపడుతున్నారని, వైద్యం చేయించాలంటూ హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మంగళవారం కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. వివరాలు తెలుసుకున్న కలెక్టర్.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటితో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సాయిబాబా ప్రభుత్వ వాహనంలో వారిని తీసుకొని సరోజిని కంటి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం తగిన వైద్యం అందేలా ఏర్పాటు చేశారు.